'పని చేసుకో కూడదా? కుర్చీ వేసుకు కూర్చోనా?'

మళ్లీ అమ్మమ్మ జ్ఞాపకం వచ్చింది తనకు.

అమ్మమ్మ ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే వుండేది. ఒక్క నిమిషమైనా ఊరుకునేదికాదు. దిగులుగా అమ్మకేసి చూసింది. అమ్మ ముఖమూ వాడిపోయింది. తనను దగ్గరకు తీసుకుని కళ్లనీళ్లు పెట్టుకున్నది. తనను చెప్పలేని బెంగ ముంచుకు వచ్చింది. ఆవురుమని ఏడ్చింది. అమ్మ సముదాయించింది.

'ఊరుకో తల్లీ. ఈ ఊరు ఏమీ బాగాలేదు కాదూ? రేపు చక్కగా రైలెక్కి మన ఊరు వెళ్లిపోదామమ్మా. ఇంక ఇక్కడ వుండవద్దు.' అన్నది.

తన తల్లో రైలుచక్రాలు గిరగిరా తిరిగినట్లయింది.

ఆ సెలవలు, ఆ తోట, సముద్రపు హోరు, మేరీపాట అన్నీ అమ్మమ్మ కథలలాగే దూరమై, ఇంకా దూరమైపోయినాయి.

# ★ స్థానికసంస్థల ఎన్నికలు

★ వంక నాగమణి

ఆ మధ్య స్థానిక సంస్థల మంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు చిత్తూరుజిల్లా కుప్పంలో మాట్లాడుతూ, నూతన రాజ్యాంగం అమల్లోకి వస్తేనేగాని జిల్లాబోర్డు ఎన్నికలు జరగవని వివరిస్తూ, నూతన రాజ్యాంగం రీత్యా జిల్లాబోర్డులకు ఇప్పటికంటే అధికారాలు ఎక్కువగా వుంటాయి కాబట్టి నిజమైన పరిపాలన అప్పుడు అమల్లోకి వస్తుందని సెలవిచ్చారు. అసలే జిల్లాబోర్డులకు ఎన్నికలు జరిగి పన్నెండు సంవత్సరాలవొస్తోంది. నూతన రాజ్యాంగం ప్రకారం అసెంబ్లీ ఎన్నికలు 1950 లో జరిగితే జిల్లాబోర్డు ఎన్నికలు జరిగే సరికి ఇంకో సంవత్సరం పడుతుంది. అదైనా వచ్చే సంవత్సరం ఎసంబ్లీ ఎన్నికలు జరిగితే మాట. అసలు ఈ ఎన్నికలు వాయిదాలపై వాయిదాలు వేయుటకు కారణమేమిటి?

కాంగ్రెసు అధికారంలోకివచ్చి మూడు సంవత్సరాలు పూర్తి కావస్తోంది. ఈ మూడేండ్లలోను ఏ ఘనకార్యం చేయలేదు సరికదా, కనీసం ఏఒక్క ప్రజా సమస్యను పరిష్కరించ లేకపోయారు. ఈ మూడేండ్లు ప్రజలకు చాలా సౌకర్యాలు చేసివుండేవాళ్లం కాని- మతకలహాలు, కాశ్మీర్ యుద్ధం, సంస్థానాల సమస్యలు ముంచుకొచ్చాయి అన్నారు. ఇవన్నీ ఏదోరకంగా ఒకదరిచేరాయిగా! దేశంకోసం, ఫలితం ఆశించకుండా, కృషిచేయండి అని పదేపదే వక్కాణిస్తున్నారు. లేకపోతే దేశం చాలా ప్రమాదం ఎదుర్కొంటుంది అని బర్మా, మలయా, చైనాలు చూపుతున్నారు ఇప్పుడు.

ఎలక్షన్ నాటి కాంగ్రెసు ఈరోజు కాంగ్రెసు మాత్రంకాదు. ఈ సత్యం నాయకులు గుర్తించాలి. ఉదాహరణకి 1947 లో జరిగిన ఆ కొద్దిపాటి మునిసిపల్ ఎన్నికలు చూస్తే బోధపడుతుంది. ముఖ్యమైన నగరాలలో - బెజవాడ, బందరు, ఏలూరు, రాజమండ్రి, కాకినాడలలో కాంగ్రెసు పూర్తివిజయం పొందలేకపోయింది. నూటికి నలభైమంది ఓటర్లు జాతీయసంస్థకు విముఖత చూపించారు. కాకినాడలాంటి పట్టణంలో, కాంగ్రెస్, ఓడిపోయే స్థితిలో ఇతరపార్టీ సహాకారంతో ఆస్థానమలంకరించకల్గింది. పాలకొల్లులో కాంగ్రెసు పూర్తిగా ఓడిపోయింది. బొంబాయి కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెసు అభ్యర్థులు చాలామంది ఓటమిని పొందారు. ఇది నానాటికి కాంగ్రెసు, ప్రజల ఆదరాభిమానాలను కోల్పోతోందని ఋజువుచేయుటలేదా? ఈ తరుణంలో ఎన్నికలుజరిపితే, ఎందరెన్ని ప్రకటనలు చేసినా ప్రజాభిప్రాయాన్ని తెలిసికోవచ్చుకదా? కాని పదేపదే ఈఎన్నికలను వాయిదాలువేయడం ప్రజాభిప్రాయాన్ని కాలదన్నడమే కదా! ఇది కేవలం రాజకీయ నిరంకుశత్వ మనిపించుకుంటుంది.